# "మ్యాజెంగ్స్"

## "చలం"

పిల్లల్లో పశుత్వం వుంది, పెద్దలమల్లేనే. దాన్ని భయాలవల్ల నిరోధించడం మూర్ఖం. అది క్రమమైన పద్ధతిలో వ్యవహరించేట్టు చూడడం ఉపాధ్యాయుడి విధి- అని ప్రతి విద్యాబోధక పుస్తకంలోనూ ఉంటుంది. బిడ్డలో పశుత్వం లేదనిగాని, కనపడ్డప్పుడు దాన్ని ధ్వంసం చెయ్యాలనిగాని చూసే ఉపాధ్యాయుడు మూర్ఖుడు. ఈమాత్రం జ్ఞానం దేశాధికారులకు లేకపోతే, చాలా ఉపద్రవం కలుగుతుంది. యూరప్ చరిత్రలో ప్యూరిటన్ రాజులు చేసిన అవక తవకలు చదివి కూడా వివేకం రాదు.

ఏ విశాల విజ్ఞానం లేని ట్రెయినింగు విద్యార్థులకి బోధించే పిల్లల మానసికశాస్త్రం తిరగవేస్తే చాలు—సైకాలజీ కూడా ఫిజియాలజీ అంత నిర్ణీతము పొందినట్లు మాట్లాడుతారు. జీర్ణకోశం పనియెంత స్పష్టమో, మనసు చేసే పనికూడా అంత స్పష్టంగా కనపరుస్తారు. బిడ్డ అంటే-ఇన్ని సహజాతాలూ, ఇన్ని రసాలూ. వాటిని చేతిలో పెట్టుకున్నామంటే చాలా సులభం- బిడ్డని ఉత్తీర్ణుణ్ణి. సంపూర్ణుణ్ణి చెయ్యడం. ఈ ముక్కల్ని ముక్కన పెట్టుకుని, జాగ్రఫీలో ఎగుమతి దిగుమతులకుమల్లే వల్లన వేస్తూవుంటే, యివి బోధించవలసిన గతి పట్టినందుకు ఏడుపు వొస్తుంది.

కాని ట్రయినింగుస్కూళ్లలోనేకాదు, దేశ పరిపాలకుల్లోనూ ఇదే అభిప్రాయం బైలుదేరింది. రష్యాలో బైలుదేరిన 'బిహేవియరిస్టిక్ సైకాలజీ' దీనికి ముఖ్యకారణం. ప్రజల మానసప్రవృత్తినీ, దానిద్వారా, వారి ప్రవర్తననీ, తెలివైన నిబంధనలవల్ల శాసించగలమనేది భ్రాంతి. రొట్టెని చూస్తే కుక్క నోటిలోంచి నీరు కారుతుంది. ఆరొట్టితో కలిపి ఓపాట వినిపించి అలవాటుచేస్తే రొట్టె లేకపోయినా, ఆపాట విన్నప్పుడు కుక్క నోట్లోంచి నీరు కారుతుంది. ఈ సూత్రంమీద రాజ్యాలు పరిపాలిస్తున్నారు. మనుష్యస్వభావం, పశుస్వభావమంత, అంతేకాదు, ప్రకృతిలోని మార్పులంత స్పష్టంలోకి వొచ్చింది.

పసుపు సున్నం కలిసి పారాణిఅయినట్టే, మానవుడుకూడా ప్రభుత్వాలు కల్పించిన పరిస్థితుల్ని ఒకేవిధంగా తీసికొంటాడని ప్రస్తుతాభిప్రాయం. ఎవరికీ పూర్తిగా అర్థంగాని గొప్ప ఆత్మశక్తులు మానవుడిలో అణిగివున్నాయని మరిచిపోతారు. అలల్ని అదుపులో పెట్టగలిగిననాడు సముద్రమే పొంగవచ్చు.

'నా మనసులో ఏమీ దాచను- నాకు తోచింది దాన్ని మొహంమీద అనేస్తాను' అని గర్వపడే 'దాపరికంలేని' మనుషులంత మోసకార్లూ అపాయమైనవాళ్లూ వేరేవుండరు. ఆలోచించకండా తోచిందేదో అనెయ్యలేకండా ఉండలేకపోవడం—అది ఓజబ్బు, మానసిక గ్రహణి. వాళ్లకి తోచిందంతా అనడమంటే ఇతరుల విషయమై తమకు తోచిందని అర్థం. అది సాధారణంగా ఇతరుల్లోని దోషాలకి సంబంధించిందిగానే వుంటుంది. అదిగాక వాళ్లకి హాని చెయ్యనివి తోచినప్పుడే అవి బైటకి ఇతరుల మొహాలమీద విడుస్తారు. పైగా వీళ్లు నిష్కపటులు. అన్నీ చెప్పేస్తారనుకుంటారా-ముఖ్యమైనవి దాచుకొంటూనే వుంటారు. ఈ 'కపటంలేని' మనుషుల్ని నిజంగా నిష్కపటులని నమ్మిన స్నేహితులు చాలా దెబ్బతింటారువొచ్చిఅదృష్టమేమిటంటే- నేనుఏమీ దాచను' అన్న మనిషిని వివేకవంతులెవరూ నమ్మరు. ఇతరులకి అయిష్టంకలిగే సంగతిని, చాలా ప్రేమవున్నవాళ్లు తప్ప, ఇతరులు అనడం వుత్త దుర్మార్గం. తమకు తోచింది అనేసే మనుషులు తమకన్న సాధువులముందూ, గొంతు తక్కువవారిముందూ, శరీరంలో బలహీనులముందూ అంటారు. అంతేగాని వొస్తాదులముందూ, రాకాసులముందూ, దుర్మార్గులముందూ అసలు మాట్లాడరు. వీరి నిష్కాపట్యం పిల్లలయెడలా, దిక్కులేని స్త్రీలమీదా, వారిని ఆశ్రయించుకున్నవారిమీద ప్రబలంగా ప్రకటితమౌతో వుంటుంది. వీళ్లమాటలు ఎన్నో అపార్థాలకి, మనుషులమధ్య తగువులకి ముఖ్యకారణం. అనడానికి ధైర్యం లేనిచోట్ల 'మర్యాద అనో, లాభమేమిటనో తప్పించుకుంటారు. కాని వీళ్లకే మాత్రం- వాళ

స్వాంతంగా చెప్పుకోవడంవల్ల- చాలా ఉత్తములనే ప్రతీతివుంది. మనసువిప్పి మాట్లాడరని ఇతరుల్ని దూషించడం వీరికి చాలా ఇష్టం.

ఈ 'వోటు'లో చాలా మోసంవుంది. నువ్వే కదా ఎన్నుకున్నది ప్రభుత్వాన్ని అంటారు పైగా. వోట్లతో ఎన్నుకున్న మునిసిపలు వ్యవహారాలు ఇన్నిఏళ్లు ఒకేరకంగా నడిచాయి. ఎవణ్ణి ఎన్నుకున్నా ఫలితం వొకటేకదా అని వోటుమీది ఉత్సాహం తగ్గిపోతుంది ప్రజకి. ఈ ఎన్నుకోబడే సామర్థ్యం మళ్లేనే. అది వొకప్రతిభేకాదు, కళ కూడాను. ప్రతివారికీ చాతకాదు అది. తక్కిన సామర్థ్యాలూ గుణాలు ఎన్నివున్నా, అవేమీ యీ విషయంలో ఉపకరించవు.

ఈనాటి ప్రజలు క్రమంగా ప్రతి అనుకూలం కోసమూ ప్రభుత్వాలమీద ఆధారపడడమూ, ప్రభుత్వాలు ప్రజల జీవితాల్లో కలగచేసుకుని నిర్ణయించడమూ జరుగుతోంది. ప్రజల బాహ్యక్షేమానికి చాలా ఉపకారాలు నాటినాటికీ హెచ్చుగా కలుగుతున్నట్టు కనపడ్డా, లోపల లోపల కనపడకండా వ్యక్తిస్వాతంత్రం హరించి పోతో వుంటుంది. ప్రభుత్వంమీద బాగా ఆధారపడడంవల్ల, తప్పు అంటే ప్రభుత్వానికి కోపం తెప్పించడమే అనే దానికింద తేలుతుంది. అసలు ధిక్కరించే తిరుగబాటూ, స్వతంత్రంగా యోచించే శక్తీ, చాలా నాజూకుగా, నొప్పిలేకండా తెలీకండా లాగేస్తున్నాయి ప్రభుత్వాలు. ఈ పద్ధతికి చాలా పెద్దపేర్లు పెడతారు- విద్యా, సంస్కృతీ, లా, ఆర్డర్, దేశానికి ఉపద్రవరక్షణా ఇట్లాంటివి. ప్రభుత్వాధికారులు ఈ పనులు కావలిసిచేస్తున్నారని కాదు. ప్రపంచపరిస్థితులు ఎంత మంచి ప్రభుత్వాల్నీ ఈ విపరీత విధానాలకి బలవంతం చేస్తున్నయి. ఇంకో విశాలమైన దృష్టివుండి దానికి అనుగుణంగా ప్రవర్తిస్తే దేశం అరాజకమౌతుంది. ప్రజలలో స్వతంత్రేచ్ఛ విరివిగా వ్యాపించిన కొద్దీ, వారిని మోసగించి, నిద్రపుచ్చగల నేర్పు ప్రభుత్వానికి అవసరమౌతుంది. కొత్తగా స్వతంత్రం చవిమాస్తున్న ప్రజలకి స్వతంత్రమంటే పూర్తిగా తెలీదు గనక- విరివిగా డబ్బూ, వేళకి తిండీ, సౌకర్యాలూ చూసుకుని తమకి చాలా స్వతంత్రం వొచ్చిందని సులభంగా మోసపోతారు. ప్రతి ప్రభుత్వం ఈనాడు కొంతవరకైనా నియంతల్ని అనుకరిస్తోంది అందువల్లనే.

ఇట్లాంటిది ఆఫీసుల్లో, ఇళ్లల్లోకూడ జరుగుతో వుంటుంది. మాకో హెడ్మాస్టరు వుండేవాడు. కొత్తటీచరు ఆ బడికి బదిలీ కాగానే, ఏదో ఓ చిన్న తప్పుకోసం కాచుకుని వుండి, దాన్ని పెద్దది చేసి గొప్ప ఆగ్రహం చూపించి బెదరకొట్టి పైకి రిపోర్టు రాస్తానని, క్షమించేవాడు. ఇంక ఆ టీచరు తన బతుకంతా అతని బానిసగ అయ్యేవాడు. పొగరుమోతు విద్యార్థుల్నీ అంతే. అందువల్ల చాలా గట్టి హెడ్మాస్టరని పేరు ఆయనకి.

కుటుంబాల్లోనూ యింతే. ఇంటి అధికారి ఇంట్లోవాళ్ళని అదరకొట్టి, వెళ్ళగొడతాననే భయంలోపెట్టి ఎదురుచెప్పే సారాన్ని పీల్చేసి తన కుటుంబం ఎంత శాంతంగా జరుగుతోందో అంటాడు. తన ఇంట్లో వున్నవాళ్ళకి జాగ్రత్తగా కావలసిన సదుపాయాల్ని చూసి సుఖపెడతాడు. కాని ఇదంతా తనమాటకి ఎదురు చెప్పనంతవరకే. తన ఇంటినుంచి పోతే వాళ్లు బతగగల సామర్థ్యాన్ని పూర్తిగా పీల్చేస్తాడు. అతను యిచ్చే సౌఖ్యాల్ని గలిగి, అతని అదుపులకీ కోపానికీ జడిసి, యత్నంలేకుండా చాలా తృప్తిపడి బ్రతుకుతారు అతని అధీనులు.

రాజ్యాలికముందు అట్లానే తయారు కావాలని చూస్తున్నాయి. ప్రజలకి తిరగబడవలసిన అగత్యం తక్కువౌతుంది. కాని తిరగబడ్డారా, సర్వవిధాలా నాశనమే. చంపనక్కరలేదు. ప్రభుత్వాన్ని ధిక్కరించిననాడు బియ్యం దొరకవు, పంపులో నీళ్ళు రావు.

తన రచన పంపిస్తూ 'యువరచయిత' తాజాకలం :
"యీ కథలో వచ్చేపాత్రలు జీవిస్తూన్నవాళ్లగాని, మరణించిన వాళ్లగాని ప్రమేయంలేకుండా ఉంటాయి."

ఆ రచన తిప్పివేస్తూ 'సంపాదకు'ని పెన్సిలు వ్యాఖ్య:
"ఆ కారణం చేతనే తిప్పి పంపివేయడమైంది."